క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు



ఆకుపసర చిత్రాలను ఆసక్తిగా గమనిస్తున్న న్యాయమూర్తులు

గార: ఆది కూర్మ క్షేత్రంలోని శ్రీకూర్మనాథున్ని తెలంగాణ, పాట్నా హైకోర్టు న్యాయమూర్తులు శుక్రవారం కుటుంబసమేతంగా దర్శనం చేసుకున్నారు. జస్టిస్ జె.శ్రీనివాసరావు, జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్‌లకు ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. పరివేట్టం చుట్టి ఆలయ సంప్రదాయం ప్రకారం మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీసన్నిధి, తాబేళ్ల పార్కు, గంధర్వ శిల్పకళ స్తంభాలు, ఆకుపసర చిత్రాలను సందర్శించారు. వారితో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఉన్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు వేదాశీర్వాచనం చేయగా, ఈవో జి.గురునాథరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

కుమారరాజుకు తెలుగుకీర్తి పురస్కారం



బుర్రి కుమారరాజు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమాపతి సమాచారం అందించారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో ఈ నెల 21న జరిగే సభలో పురస్కారం అందిస్తారని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ ఆర్.జనార్దన్

గార: సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దన్ అన్నారు. శుక్రవారం చిన తూలుగు గ్రామంలో సంకల్పంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ అంటూ వస్తున్న ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని హితవుపలికారు. బ్యాంకు పేరిట ఎవరూ వ్యక్తిగత సమాచారాన్ని అడగరని, అలా అడిగిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా పరిస్థితుల్లో సైబర్ మోసానికి గురైతే తొలి గంటలోనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. గంజాయి, మద్యం కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రవి

జి.సిగడాం: పదో తరగతి ఫలితాల్లో జి.సిగడాం మండలం ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావులు సూచించారు. స్థానిక కార్యాలయంలో హెచ్‌ఎంలతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ఉత్తమ ఫలితాల సాధన కోసం అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎంవీఎస్ఎస్ నర్సింహమూర్తి, కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి గ్రామ సమీపంలో అరటితోటలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని శ్రీకాకుళం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,320 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కమల్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టుల భర్తీలో అవకతవకలు జరగకుండా న్యాయం చేయాలని దివ్యాంగుడు వై.కమల్‌కుమార్ కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమల్‌కుమార్ మాట్లాడుతూ మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో బీఎల్ఐఎస్‌సీ అనేది ఇంటిగ్రేటెడ్‌గా ఉంటుందని సర్టిఫికెట్‌లో స్పష్టంగా పేర్కొన్నా.. తన అర్హతను పరిగణించడం లేదని వాపోయారు.

ధర ఢమాల్..!

- పడిపోయిన టమాట ధర
- ప్రస్తుతం కేజీ ధర రూ.15 నుంచి రూ.20లు
- లబోదిబోమంటున్న రైతులు



కేశవరావుపేటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన టమాటా



వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టమాటా బాక్సులు

ఎచ్చెర్ల క్యాంపస్: కొన్ని రోజుల క్రితం వరకు సెంచరీ మార్క్ దాటిన టమాట ధర ఒక్కసారిగా తగ్గిపోయింది. డిమాండ్ కంటే సప్లయ్ ప్రస్తుతం పెరగడంతో ధరలు ఆకాశం నుంచి నేలరాలాయి. ప్రస్తుతం ధర రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. వాస్తవానికి రైతుకు మాత్రం కేవలం రూ.10 నుంచి రూ.15లు మాత్రమే లభిస్తోంది. ఇంకా కొన్ని రోజుల్లో ధర మరింత తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. టమాటా వినియోగం ప్రస్తుతం ఎక్కువగా ఉంది. ప్రతీ వంటింట్లో పేద, మధ్య తరగతి కుటుంబాలు నుంచి అందరూ వినియోగిస్తున్నారు. వెజ్, నాన్‌వెజ్ అనే తేడా లేకుండా కూరల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. సీజనల్‌గా పండే ఈ పంటను స్థానిక రైతులు విస్తృతంగా సాగు చేస్తారు. పంట డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిల్లో వస్తుంది. ఈ నెలల్లో టమోటా ధర తగ్గుతుంది. మిగతా నెలల్లో బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఆయా రోజుల్లో టమాటా ధర చుక్కల్లో ఉంటుంది.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో..

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో విస్తారంగా టమాటా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 1,000 ఎకరాలు వరకు సాగు చేస్తున్నారు. ఎచ్చెర్ల మండలంలో సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. ఫరీదుపేట, కేశవరావుపేట, మెట్టపేట, ఎస్ఎం పురం, ఎచ్చెర్ల, చిలకపాలేం తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు. రైతులు శ్రీకాకుళం పట్టణంలోని రైతు బజార్, పొట్టి శ్రీరాములు మార్కెట్, ముత్యాలమ్మ మార్కెట్‌ల్లో అమ్మడం, వ్యాపారులకు నేరుగా అమ్మడం చేస్తారు. కింతలిమిల్లు, చిలకపాలేం, రణస్థలం వంటి ప్రాంతాల్లో జాతీయ రహదారికి అనుకొని సైతం వ్యాపారులు కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తారు. పంట పండించే రైతులు సైతం నేరుగా రూ.50కి మూడు కిలోలు అమ్ముతున్నారు.

చేతికొచ్చేసరికి ధర పడిపోయింది



టమాటాకు అన్ని కూరగాయలతో పోల్చితే డిమాండ్ ఎక్కువ. అందుకే సీజనల్‌గా సాగు ఈ ప్రాంతంలో ఎక్కువ. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పంట ఎక్కువగా చేతికి వస్తుంది. డిసెంబర్‌లో ధరలు మెరుగ్గా ఉంటాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ధర పడిపోతుంది. ధరలో నిలకడ ఉంటే రైతుకు ప్రయోజనం ఉంటుంది.

– పైడి రామారావు, ఇబ్రహీంబాద్, ఎచ్చెర్ల

నిల్వకు అవకాశం లేదు



పంట ఎక్కువగా ఉండేటప్పుడు కొన్నాళ్లు నిల్వచేసే అవకాశం ఉంటే ధర పలికేటప్పుడు రైతు పంట అమ్ముకునే అవకాశం ఉంటుంది. కోల్డ్ స్టోరేజీలు వంటివి లేకపోవడం వల్ల ఎంత ధర వస్తే అంతకు అమ్ముకోవాల్సి వస్తోంది. తక్కువ ధరకు అయినా వ్యాపారులకు అమ్ముకోక తప్పని పరిస్థితి ఉంది. నిల్వ చేసే అవకాశం లేని పంట పాడవ్వక ముందే అమ్మాలి.

– సువ్వారి సన్యాసిరావు, కేశవరావుపేట, ఎచ్చెర్ల

ప్రతిఏటా ఇదే సమస్య



ప్రతిఏటా టమాటా ధర సీజనల్‌గా పంట చేతికి వచ్చే సమయంలో తగ్గిపోతుంది. రైతులు విస్తీర్ణం సైతం తగ్గించి సాగు చేస్తున్నారు. గతంతో పోల్చితే టమాటా విస్తీర్ణం తగ్గింది. టమాటాకు కనీస ధర అంటూ ఉండదు. స్థానికంగా పంట లేని సమయంలో కిలో రూ.50 పైబడి పలుకుతుంది. ఒక్కోసారి సాగు యాజమాన్య ఖర్చులు సైతం రాని పరిస్థితి వస్తుంది. చాలాసార్లు పంట పొలాల్లో వదిలేసిన పరిస్థిలు సైతం ఎదురయ్యాయి.

– మెట్ట ప్రసాద్, మెట్టపేట, ఎచ్చెర్ల

మరమ్మతులు చేయరూ..?



లావేరు మండలంలో మురపాక పంచాయతీ నాజానపేట గ్రామంలోని చేతిబోరు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇక్కడ బోరు పాడై చాలా కాలం గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడి ప్రజలకు తాగునీటికి ఈ బోరే దిక్కు. అయితే బోరు పాడైపోవడంతో పండగ పూట సైతం తాగునీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బోరు బాగు చేయాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

శిథిలమైన ట్యాంకర్



ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామానికి సమీకృత రక్షిత మంచినీటి పథకం నుంచి నీటి నిల్వ చేసి, నీటి సరఫరా అవుతున్న ట్యాంక్ శిథిలమైంది. దీంతో నీరు లీక్ అవుతోంది. నీటి లీకేజీ వలన తాగునీరు వృథా అవ్వడంతో పాటు ట్యాంక్ నాచు పడుతోంది. అందువలన అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

సంతోషిమాతకు పూజలు



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో పుష్యమాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవ, మహన్యాస పూర్వక నమక చమక సహిత పంచ సూక్తాలతో క్షీరాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

గార: మండలంలోని 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం చేపట్టిన నివేదికలపై శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో సీహెచ్ సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 25 పంచాయతీలకు సంబంధించి రూ.26.26 కోట్లు విలువ గల పనులుపై సామాజిక తనిఖీ బృందం పలు విధాలుగా తనిఖీలు, వేతనదారుల వద్ద సేకరించిన వివరాలపై నివేదికను సమర్పించనుందని పేర్కొన్నారు. ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొంటారని, వేతనదారులు హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఎచ్చెర్ల క్యాంపస్: ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



జి.సిగడాం: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఎచ్చెర్ల: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలో కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని ఏకోత్తర శ్రీచక్రమేరువుల దేవీ ఆశ్రమంలో మహామేరువుకు శుక్రవారం ఘనంగా క్షీరాభిషేకాన్ని పీఠాధిపతి బాలభాస్కరశర్మ ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

జి.సిగడాం: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో వెలిసిన చిన్న కంచెమ్మ, పెద్ద కంచెమ్మలకు శుక్రవారం గ్రామానికి చెందిన కర్రి అప్పలనాయుడు శారద, సత్యారావు సుధారాణి, వైకుంఠేశ్వరావు గంగేశ్వరిల దంపతులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని గెడ్డ కంచరాం గ్రామంలో పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. గ్రామంలో గత మూడు రోజుల నుంచి ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు కల్పించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం దుర్గా మహేశ్వరి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా దుర్గాదేవిని ఆలంకరించారు.

జి.సిగడాం: మండలంలోని మధుపాం గ్రామంలో వెలసిన దుర్గాదేవికి మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి యాత్ర సందర్భంగా ఉదయం– సాయంత్రం వేద పండితుల సమక్షంలో పూజలు నిర్వహించారు.



జి.సిగడాం: పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారు



జి.సిగడాం: పూజలు చేస్తున్న దృశ్యం



జి.సిగడాం: జాతరకు పోటెత్తిన భక్తులు


బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగర పరిధిలోని బ్యాంకర్స్ కాలనీలో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు సాయి మందిరంలో శుక్రవారం బ్రోచర్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీ) సహకారంతో సాయి బృందావన కేంద్రంలో ఆరు నెలల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వృద్ధులకు, ఎవరి సహకారం లేనివారికి మందులు, ఇంజక్షన్లు, బీపీ, షుగర్ చెకప్ తదితర పనులపై శిక్షణ ఉంటుందని వివరించారు. తొలి విడుతగా 15మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి కలిగిన ఆసక్తి గల మహిళలు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9948004156, 9440398049 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సాయికుమార్, సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, జోనల్ కన్వీనర్ శివన్నారాయణ, మందిరం కన్వీనర్ ఎ.ప్రసాదరావు, టీఎస్ఎన్‌మూర్తి, డోకి జనార్దన్, అంధవరపు సురేష్, వంశీకృష్ణ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వల్లభ రథయాత్ర



నైరాలో కొలువైన వల్లభనారాయణ స్వామి



యాత్రలో పాల్గొన్న భక్తులు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా గ్రామంలో కొలువైన వల్లభ నారాయణస్వామి జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. భద్రం ఆదిత్య శర్మ, అరవింద్ శర్మలు ఆధ్వర్యంలో వేకుజామున మూడు గంటలకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి అనంతరం భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. తొలుత ఆలయ ధర్మకర్త, సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో కోలాటాలు, బాణసంచా నడుమ రథయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆడపడుచులంతా గారమ్మతల్లి పేరంటానికి ముగ్గులు సమర్పించారు. సాయంత్రం స్వామివారి గుడి శిఖరాన పెళ్లికాని యువతులు శిఖర దీపం వెలిగించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు పర్యవేక్షించారు.

నిషేధిత కార్యకలాపాలపై నిఘా



పెదపాడు పరిసర ప్రాంతం డ్రోన్ వ్యూ



పొన్నాం, బట్టేరు పరిసర ప్రాంతంలో ఎగురుతున్న డ్రోన్



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు ఆస్కారమున్న ప్రాంతాలపై పోలీసులు నిఘా వేసారు. ఏయే ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారో, బహిరంగ మద్యపానం జరుగుతుందో తెలుసుకునేందుకు శుక్రవారం డ్రోన్ కెమెరా ఎగురవేశారు. ఎస్ఐ రాము పర్యవేక్షించారు.

– శ్రీకాకుళం రూరల్

జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



దీవెనకుమార్‌తో డీఎస్‌డీఓ శ్రీధర్, కోచ్ ఉమ

శ్రీకాకుళం న్యూకాలనీ : సిక్కోలు కుర్రాడు బొండాన దీవెనకుమార్ బాక్సింగ్ పోరులో మరోసారి సత్తాచాటాడు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగిన సౌత్‌జోన్ సబ్ జూనియర్ నేషనల్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో 49 కేజీల విభాగంలో రజత పతకం సాధించాడు. శ్రీకాకుళం నగరానికి చెందిన యువ కుర్రాడు జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకంతో రాణించడం పట్ల బాక్సింగ్ అసోసియేషన్ ఏపీ స్టేట్ సెక్రటరీ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్(అను) సంతోషం వ్యక్తంచేశారు. తీర్చిదిద్దుతున్న కోచ్ ఉమాను ప్రశంసించారు. పతకం సాధించిన దీవెనకుమార్‌ను డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, కోచ్ ఎం.ఉమామహేశ్వరరావు శుక్రవారం కేఆర్ స్టేడియంలో అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం: 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల: 9951602849
Office mail : sklmadvt@gmail.com